క్లుప్తంగా

విద్యా దీవెన నిధులు విడుదల చేయాలి



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన నిధులను వెంటనే విడుదల చేయాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని కోరారు. ఆదివారం దుగ్గిరాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.3,840 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పరీక్షలు దగ్గర పడడంతో ఫీజు బకాయిలు విడుదల కాకపోవడం వల్ల కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని, వెంటనే నిధులను విడుదల చేసి బకాయిలు చెల్లించాలని, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కుంచనపల్లిలో ఉచిత వైద్య శిబిరం



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ కుంచనపల్లిలో మానవ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగర సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ కుంచనపల్లిలోని రామ్ స్నేహ ఎవెన్యూలో వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. సుమారు 200 మందికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారని పేర్కొన్నారు. శిబిరంలో వైద్యులు నిఖిల్, కె.శ్రీకర్, లక్ష్మీ కంటి పరీక్ష కేంద్రం వైద్యులు తమ సేవలను అందజేశారని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సంస్థ సభ్యులు కోటేశ్వరరావు, ఆదినారాయణ, నరసింహారావు, విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ



తాడికొండ: రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగకపోతే చర్యలు తప్పవని తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ హెచ్చరించారు. ఆదివారం తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వివాదాలు, సెటిల్ మెంట్లలో జోక్యం చేసుకుంటే ఇబ్బందులు తప్పవన్నారు. ఎక్కడైనా వివాదాల్లో తలదూర్చినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సీఐలు గంగా వెంకటేశ్వర్లు, అంజయ్య పలువురు ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తాడేపల్లిరూరల్ : విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలపై జోక్యం చేసుకోవాలని, పోరాట కమిటీ నాయకులు కూరపాటి స్టీవెన్ కోరారు. ఆదివారం బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి, మాట్లాడారు. కార్మికులు తమకు రావలసిన బకాయిల కోసం దీక్షలు చేపట్టి 12 రోజులు అయ్యాయని, మంత్రి నారా లోకేష్ ఈ విషయంలో జోక్యం చేసుకుని కార్మికుల సమస్యను పరిష్కరించే దిశగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి.వెంకటేశ్వరరావు, బి.అంకయ్య, కె.ఆదినారాయణ, ఎం.గురవయ్య, ఎ.నాగేశ్వరరావు, ఎస్.సుబ్బారావు, కె.సీత, వై.లక్ష్మి, డి.రమణ, నవనీతం, దుర్గాభవాని పాల్గొన్నారు.

కార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో బాలబాట

తెనాలిరూరల్: కమ్యూనిటీ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ(కార్డ్స్) సంస్థ ఆధ్వర్యంలో అంగలకుదురు గ్రామంలో బాలబాట కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. విద్యార్థులకు ఆటపాటలతో చదువు నేర్చుకోవడంపై అవగాహన కలిగించారు. తెనాలి డివిజన్ రూరల్ లెప్రసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్యామ్ ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యార్థుల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు సంస్థ డైరెక్టర్ కె.మేరీ తెలిపారు. డిప్యూటీ డైరెక్టర్ ఆర్.అనిత, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం.. చిరస్మరణీయం

- సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి
- అమరజీవికి ఘనంగా నివాళులు



పొట్టిశ్రీరాములు, వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సమన్వయకర్త వేమారెడ్డి, నాయకులు

తాడేపల్లిరూరల్ : అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం వల్లే ఆంధ్ర రాష్ట్రం అవతరించిందని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మకూరులోని పార్టీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా వేమారెడ్డి, మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావు పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు, వల్లభాయ్ పటేల్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చి కొత్తల్లో తెలుగువారిని కూడా తమిళవారు అనేవారని, ఆంధ్ర వారు అంటే చిన్న చూపుతో చూడడం నచ్చని పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని తెలిపారు. ఆయన ప్రాణ త్యాగం వల్లనే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. తెలుగువారందరిని ఏకం చేసిన వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఉక్కు మనిషి వల్లభాయ్ పటేల్ ఉప ప్రధానిగా ఉన్న సమయంలో భారతదేశంలోని అనేక సంస్థానాలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకువచ్చి ప్రజలందరూ ఒక్కటే అని నిరూపించారని కొనియాడారు. ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహనరావు మాట్లాడుతూ ప్రపంచమంతా తెలుగువారిని గుర్తించే విధంగా చేసిన వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని, వల్లభాయ్ పటేల్ భారతదేశానికి చేసిన సేవలు ఎన్నటికీ మరువలేమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆకురాతి రాజేష్, జిల్లా నాయకులు మల్లపు సుధారాణి, ఈపూరి ఆదం, వడ్డేశ్వరపు రజనీకాంత్, ఉట్లపాల శ్రీనివాస్, షేక్ మాబాబు, చిలువూరు ఫిలోమిన, దొడ్డ కృష్ణ, తాడిబోయిన సుబ్బారావు, తాడిపోయిన సురేష్, విక్కీ, ప్రశాంత్, కుంచాల కృష్ణ కిషోర్, గంజి షణ్ముఖ్, నిర్మల, కురగంటి ఆదం, మాతంగిబాబు, కలకోటి చక్రవర్తి, వెనిగండ్ల నాగేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు సేవలు ఎనలేనివి

ఫిరంగిపురం: మండల పరిషత్ ప్రజా కార్యాలయంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎంపీడీవో వెంకటేశ్వరరావు సిబ్బందితో కలిసి పూలమాలవేసి, నివాళులర్పించారు. తెలుగు జాతి గొప్పతనాన్ని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి శ్రీరాములు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్ : ఆంధ్రప్రదేశ్ అవతరణకు కృషి చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలను మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పలు ప్రాంతాల్లో, దుగ్గిరాల మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు.

- మంగళగిరి మెయిన్ బజార్‌లో కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు, ట్రస్ట్ ప్రతినిధులు కర్నాటి శివ సత్యనారాయణ, పెరుమాళ్ళ సుబ్రహ్మణ్యం, శివన్నారాయణ, హనుమంతరావు, న్యాయవాది విజయ్‌కుమార్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.
- మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషన్ అలీమ్ బాషా కార్యాలయ సిబ్బందితో కలసి అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మద్రాసు ప్రెసిడెన్సీలో తెలుగు ప్రజల కష్టాలను చూసి భాషా పరంగా తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అవశ్యకమని దీక్ష బూని 56 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణ త్యాగం చేసి ఆంధ్రరాష్ట్ర అవతరణకు కారకులయ్యారన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.
- దుగ్గిరాలలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు 1901 మార్చి 16న జన్మించారని, ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి 1952 డిసెంబర్ 15న ప్రాణాలర్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అన్నవరపు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చుండూరు లక్ష్మణ్, సభ్యులు చుండూరు మోహన్ కుమార్, ఫణి, హేమంత్, గ్రామ పంచాయతీ కార్యదర్శి వివేక్, సభ్యులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఫిరంగిపురం ఎంపీడీవో వెంకటేశ్వరరావు



జెడ్పీ పాఠశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి

పొట్టి శ్రీరాములుకు నివాళి

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని కళ్లం అంజిరెడ్డి జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పొట్టిశ్రీరాముల జీవిత చరిత్రను, ఆంధ్రరాష్ట్ర అవతరణకు చేసిన త్యాగాన్ని విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు తాతిరెడ్డి వివరించారు.

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలొదిలిన పొట్టి శ్రీరాములు

వైఎస్సార్‌సీపీ తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు



నివాళులర్పిస్తున్న సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు

తాడికొండ: ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు కీలక పాత్ర పోషించి, ప్రాణాలొదిలిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆయన చేసిన కృషి అజరామరమని వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త, గుంటూరు నగర డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు(డైమండ్ బాబు) అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతిని గుంటూరు మల్లికార్జునపేట 5వ లైనులోని తన కార్యాలయంలో నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకుటిత దీక్ష, నిస్వార్థం, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించి, అమరుడైన పొట్టి శ్రీ రాములు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న నందం అబద్దయ్య తదితరులు

తాడేపల్లిరూరల్: ఆత్మకూరులో వేంచేసిన శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పద్మశాలీయ బహుత్తమ సంఘం చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ పాలక మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి దంపతులు విచ్చేసి, పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి భక్త బృందం సభ్యులు మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో గణపతి, శాంతి, మృత్యుంజయ హోమాలు నిర్వహించామని తెలిపారు. సుమారు 20 మంది దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొననగా, ఐదుగురు వేద పండితులు హోమాది కార్యక్రమాలు నిర్వహించారని పేర్కొన్నారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు తాటి వెంకటరావు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కొమ్మా సుకుమార్, జనసేన నాయకులు కట్టా కృష్ణ, శానం మాణిక్యరావు, గూడపాటి వీరతేజ, మోతుకూరి రవి, శ్రీ వీరభద్రస్వామి భక్తబృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై పునరాలోచన చేయాలి



సంఘీభావంగా వెళ్తున్న అంబేద్కర్ యువజన సభ్యులు

మేడికొండూరు : గుంటూరు పరిధిలోని నల్లపాడులో ఆదివారం ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ హలో మాల, చలో గుంటూరు కార్యక్రమానికి సంఘీభావంగా మేడికొండూరు మండల పరిధిలోని సిరిపురం గ్రామం నుంచి అంబేడ్కర్ యూత్ నందా అనిల్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా నంద అనిల్ మాట్లాడుతూ మాల–మాదిగలను విడదీసి పాలించే కుట్రలను తాము సహించబోమన్నారు. రిజర్వేషన్లపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచించాలని డిమాండ్ చేశారు. మాలలకు అన్యాయం చేయాలని చూస్తే పరిణామాలు వేరుగా ఉంటాయని, రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సిరిపురం గ్రామంలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించి నల్లపాడులో నిర్వహిస్తున్న కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో గుడిపూడి శంకర్, పిల్లి నరేష్, లక్క సాగర్, లామ్ రవి, క్రీస్తు రాజు, దానియేలు, లక్క దాసు, ప్రకాశం, ప్రకాష్ రావు, ఆకాష్, విక్కి పాల్గొన్నారు.

పెనుమాకలో సెమీ క్రిస్మస్ వేడుకలు



క్యాలెండర్ ఆవిష్కరణలో సంఘ పెద్దలు



సెమీ క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న చర్చి నిర్వాహకులు

తాడేపల్లిరూరల్: పెనుమాక గ్రామంలోని లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను చర్చి పెద్దలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాస్టర్ ప్రశాంత్‌రాజ్ విచ్చేసి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిన్నారులు క్రిస్మస్ పాటలను నృత్యాల రూపంలో ప్రదర్శించారు. అనంతరం చర్చి సంఘ పెద్దల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ వేడుకల్లో గ్రామస్తులు పాల్గొని సెమీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

భూసార పరీక్షలు ఆధారంగా పంటల సాగు



భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

ప్రత్తిపాడు: భూసార పరీక్షల ఆధారంగా రైతులు పంటలను సాగు చేసుకుంటే సత్ఫలితాలుంటాయని వ్యవసాయ విద్యార్థినులు రైతులకు వివరించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా వట్టిచెరుకూరులో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. రైతులు తమ భూముల నుంచి శాస్త్రీయంగా మట్టిని సేకరించి సమీపంలోని వ్యవసాయ ప్రయోగశాలల్లో అందించాలని కోరారు. పరీక్షల ఆధారంగా భూమిలో పంటలకు కావాల్సిన పోషకాలు ఉన్నాయా లేదా అన్నది తెలుసుకోవచ్చని చెప్పారు. పరీక్షల ఆధారంగా పంటలను సాగు చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. అధిక మోతాదులో రసాయనిక ఎరువులు వినియోగించడం వలన భూసారం తగ్గి, పెట్టుబడుల భారం అధికమవుతుందని తెలిపారు. అనంతరం పొలంలో మట్టి సేకరించే విధానాన్ని ప్రయోగాత్మకంగా రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థినులు గాయత్రి, ముస్కాన్ కుమారి, హ్యాపి సహజ, గీతాభవాని, సాహితి, బృంద, అభినయశ్రీ పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తే చర్యలు

నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీనివాసులు



భవనాలను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నూతనంగా నిర్మాణం చేసే బహుళ అంతస్తు భవనాలు రోడ్ల మీదకు ర్యాంప్‌లు, డ్రెయిన్లపై నిర్మాణాలు చేయకుండా, డ్రెయినేజీ లైన్‌ని మేజర్ డ్రెయిన్‌లోకి కనెక్ట్ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేసిన భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) జారీ చేయబోమని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆదివారం గోరంట్ల, రెడ్డిపాలెం ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, సెట్ బ్యాక్, రోడ్ల కొలతలు, ర్యాంప్‌లను తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘన చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నామని చెప్పారు. భవనాలు నిర్మాణ దశలోనే వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిరంతరం పరిశీలిస్తూ, నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టకుంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి, నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. రోడ్ల మీదకు ర్యాంప్‌లు, డ్రెయిన్ల ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే నిర్మాణం చేసిన వాటిని తొలగించాలని స్పష్టం చేశారు. ప్రధానంగా సెట్ బ్యాక్ పోర్షన్‌లో ఏ విధమైన నిర్మాణాలు చేయకూడదని, జనరేటర్లు కూడా పెట్టడానికి వీలు లేదన్నారు. గ్రీనరీకి ప్లాన్‌లో చూపిన విధంగా ఉండాలన్నారు. వాచ్ మెన్ రూమ్ నగరపాలక సంస్థ నుంచి అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. అపార్ట్‌మెంట్ నిర్వాహకులే డ్రెయినేజి లైన్‌ను మేజర్ డ్రైన్ వరకు కనెక్ట్ చేసుకోవాలని కోరారు. పర్యటనలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ మల్లికార్జున, టీపీఎస్ లక్ష్మణ స్వామి పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాస మహోత్సవాలు

ఆలయ కార్యనిర్వహణాధికారి శిరీష

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని వేణుగోపాలస్వామి, సీతారామస్వామి వార్ల దేవస్థానంలో దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీ వేణుగోపాల స్వామి భక్త బృందం సహకారంతో సోమవారం నుంచి జనవరి 13వ తేదీ వరకు ధనుర్మాస మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.శిరీష తెలిపారు. జనవరి 10వ తేదీన శ్రీ వైకుంఠ ఏకాదశి(ముక్కోటి) ఉత్తర ద్వార దర్శనం, 11న కుడారై ఉత్సవం, 13న భోగి పండుగ, 14న మకర సంక్రాంతి, 15న కనుమ పండుగలను ఆలయంలో ఘనంగా శాస్త్రోక్తంగా జరపనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా సోమవారం నుంచి ధనుర్మాసం ముగిసే వరకు ప్రతి రోజూ తెల్లవారుజామున తిరవారాధన, తిరుప్పావై సేవా కాలం, నివేదన కార్యక్రమాలు ఆలయ అర్చకులు వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు శిరీష వివరించారు. నేటి నుండి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ప్రధాన గోపురం విద్యుత్ దీప కాంతులతో ధగధగలాడుతుంది.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి భజన

పొన్నూరు: మండలంలోని మామిళ్లపల్లిలో ఆదివారం అయ్యప్పస్వామి భజన, అభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మణికంఠుడి నామస్మరణతో ప్రాంగణమంతా మార్మోగింది. అనంతరం అయ్యప్పస్వాములకు సద్ది వితరణ గావించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



తెనాలిరూరల్: మండలంలోని కొలకలూరు గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. గ్రామంలోని మంటపం బజారుకు చెందిన వేజండ్ల శివనాగేశ్వరరావు కుటుంబంతో కలసి ఢిల్లీలో ఉంటున్నారు. గ్రామంలోని వీరి ఇంటికి అప్పుడప్పుడు వచ్చి వెళుతుంటారు. గుర్తు తెలియని దుండగుడు శనివారం అర్ధరాత్రి దాటాక ఆవరణలోకి ప్రవేశించి తాళం పగులగొట్టి ఇంట్లోకి వెళ్లాడు. ఇంటికి ఏర్పాటు చేసిన సీసీ కెమెరా దుండగుడి ఫోటో తీసి యజమానికి పంపింది. అలానే దుండగుడు చోరీకి పాల్పడుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి. ఆదివారం ఉదయం తలుపు తెరచి ఉండడాన్ని గమనించిన స్థానికులు శివనాగేశ్వరరావుకు సమాచారం అందించగా ఆయన సీసీ కెమెరా పుటేజ్‌లను పరిశీలించి ఇదే విషయాన్ని రూరల్ పోలీసులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్ ఇంటిని పరిశీలించారు. గుంటూరు నుండి వచ్చిన క్లూస్ టీం ఆధారాలు సేకరించేందుకు ప్రయత్నించింది. ఇంట్లో కొన్ని వెండి వస్తువులు చోరీకి గురయినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని నీరుకొండలో ఏపీ రాన్ హెల్త్ కేర్, ఎన్టీఆర్ ట్రస్ట్, నాట్కో, ఐలాబ్ సహకారంతో మాదల గోవర్ధన్ రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నీరుకొండ శివాలయం సెంటర్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నామన్నారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. బ్లడ్ షుగర్, సీబీసీ, క్రియాటినిన్, కొలెస్ట్రాల్, ఈసీజీ, బిలిరుబిన్, యూరిన్ టెస్ట్ వంటి పలు పరీక్షలు ఉచితంగా నిర్వహించి వైద్యులు సూచనలు, సలహాలు అందజేస్తారన్నారు. మంగళగిరి పరిసర ప్రాంత వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ ప్రతినిధులు కోరారు.

అన్ని పత్రాలతో పసుపు రైతులు రావాలి

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ బాధిత పసుపు రైతులు పత్రాలతో తప్పని సరిగా రావాలని రైతు సంఘం జిల్లా నాయకుడు జొన్న శివశంకరరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై విచారణకు సోమ, మంగళవారాల్లో హైదరాబాద్ నుంచి ఫోరెన్సిక్ అధికారులు రానున్నారని తెలిపారు. బూడిదపాలైన పంట వివరాలు అందించాలని, ముఖ్యంగా పంట భద్రపరచుకున్న రైతులు తమ ఆధార్ కార్డు, ఒరిజనల్ బాండ్, బ్యాంకు పాసు పుస్తకం, పొలం పాసు పుస్తకం, ఓటరు ఐడీ కార్డు, పాన్ కార్డు తీసుకుని హాజరు కావాలని ప్రకటనలో తెలిపారు.

జేఎంజే స్వధార్‌లో ‘రిమెంబర్ డిసెంబరు’



తెనాలి: తెనాలి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ ఏటా నిర్వహిస్తున్న ‘రిమెంబర్ డిసెంబరు’ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. స్థానిక జేఎంజే స్వధార్‌లో 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ‘పరీక్షలను ఎదుర్కోవటం ఎలా’ అనే అంశంపై తెనాలి రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ టి.వెంకటరమణ అవగాహన కల్పించారు. నిరుపేదలకు చేయూతను అందించటంలో భాగంగా, జేఎంజే స్వధార్ పాఠశాల, కాలేజీ విద్యార్థులు అరవై మందికి చెప్పులు, మానసిక, శారీరక వికలాంగులకు కాన్వాస్ చెప్పులు అందజేశారు. హృదయమేరీ, అచ్యుత సాంబశివరావు, రాజేంద్రకుమార్ రెడ్డి, దీప్తి, దుర్గా, హవీలా, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

తోపుడుబండి వితరణ



తెనాలి: పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవాసంస్థ యంగ్ జనరేషన్ టీమ్‌చే ఆదివారం రమణ అనే యువతికి తోపుడుబండిని అందజేసి, పూలవ్యాపారం ప్రారంభింపజేశారు. గతంలో ఆమె తల్లి విజయమ్మ పట్టణ టౌన్‌చర్చి వద్ద తోపుడుబండిని సమకూర్చి పూలవ్యాపారానికి సహకరించారు. ఇప్పుడు విజయమ్మ కోరికపై ఆమె కుమార్తెకూ జీవనోపాధికి సహకరించినట్టు యంగ్ జనరేషన్ టీం అధ్యక్షుడు సాదిక్ వెల్లడించారు. కార్యక్రమంలో సాదిక్‌తోపాటు రుషిత, ప్రముఖ న్యాయవాది హరిదాసు గౌరీ శంకర్, శివ, నవీన్, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో జేఎంజే విద్యార్థినుల సత్తా

తెనాలి: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో స్థానిక జేఎంజే మహిళా కళాశాల విద్యార్థినులు చక్కటి ఫలితాలను సాధించినట్లు వ్యాయామ అధ్యాపకురాలు అరుణ సుజాత తెలియజేశారు. ఈనెల 13, 14 తేదీల్లో జరిగిన పోటీల్లో కాలేజీ ఫైనలియర్ బీకాం (కంప్యూటర్స్) విద్యార్థిని డి.హేమలత హైజంప్‌లో బంగారు పతకం, ట్రిపుల్ జంప్‌లో రజత పతకం, 400/100 మీటర్ల రిలేలో రజత పతకం సాధించినట్టు తెలిపారు. ఫైనలియర్ బీఎస్సీ విద్యార్థిని కె.రూప హైజంప్, 400/100 మీటర్ల రిలేలో రజత పతకాలను, బి.కవిత, బి.దుర్గలు 400/100 మీటర్ల రిలేలో రజత పతకాలను సాధించినట్టు వివరించారు. వీరిని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ షైని కేపీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మేరీశారద అభినందించారు.